క్లుప్తంగా

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం


ఎమ్మెల్యేకి ఆహ్వాన పత్రిక అందిస్తున్న దృశ్యం

నరసన్నపేట: స్థానిక వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఈనెల 18 నుంచి నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు హాజరవ్వాలని ఆలయ ట్రస్టీ ప్రతినిధులతో పాటు బ్రహ్మోత్సవాల కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం మబగాంలోని ఆయన స్వగృహంలో ఉన్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌కు ఆలయ ట్రస్టీ చైర్మన్ వీరభద్రస్వామి, ప్రతినిధి పి.కృష్ణప్రసాద్‌లు ఆహ్వాన పత్రిక ఇచ్చారు. బ్రహ్మోత్సవాల కమిటీ ప్రతినిధులు కృష్ణమాచార్యులు, జగదీష్ బాబులు ఎమ్మెల్యేకి సత్కరించారు.

ఓటింగ్‌లో మహిళలే అధికం


ఓటింగ్‌లో పాల్గొన్న మహిళలు(ఫైల్)

సారవకోట: ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మండలంలోని మహిళా ఓటర్లే ఎక్కువగా తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మండలంలో 44,213 మంది ఓటర్లు ఉండగా, వారిలో 35,215 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. వారిలో 22,209 మంది మహిళా ఓటర్లు ఉండగా, 17,807 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. అలాగే 21,912 మంది పురుషులుండగా వారిలో 17,408 మంది తమ ఓటు వేశారు. మండలానికి శివారున ఉన్నటువంటి కూర్మనాథపురం గ్రామంలో అత్యల్పంగా 65.45 శాతం పోలింగ్ జరగగా, మరో శివారున ఉన్నటువంటి బైదలాపురం గ్రామంలో అత్యధికంగా 89.68 శాతం ఓటింగ్ జరిగినట్లు అధికారులు తెలిపారు.

ఆక్రమణలు తొలగింపు


తవ్విన గోతులను కప్పుతున్న పంచాయతీ సిబ్బంది

నరసన్నపేట: మేజరు పంచాయతీ నరసన్నపేటలోని రాజుల చెరువు గట్టుపై అక్రమంగా చేపడుతున్న నిర్మాణ పనులను పంచాయతీ సిబ్బంది అడ్డుకున్నారు. పంచాయతీ వాటర్ ప్లాంట్ ఎదురుగా చెరువుకు దిగే మెట్లు పక్కన విలువైన ప్రభుత్వ స్థలంలో భవనం నిర్మించేందుకు ఒకరు ప్రయత్నిస్తున్నారని సమాచారం తెలుసుకున్న పంచాయతీ ఈవో చిన్నారావు బుధవారం పరిశీలించి, అది చెరువు స్థలంగా గుర్తించి పనులను అడ్డుకున్నారు. అక్రమంగా తవ్విన గోతులను సిబ్బందితో కప్పించారు. అనుమతి లేకుండా నిర్మాణం చేపడితే పోలీసు కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

'పశువుల అక్రమ రవాణా అరికట్టాలి'

కొత్తూరు: మండలంలోని బలద సంత నుంచి పశువుల అక్రమ రవాణను అరికట్టాలని టీటీడీ ఆధ్యాత్మిక మండలి మండల శాఖ కన్వీనర్ పాగిరి రవి కోరారు. ఈ మేరకు కొత్తూరులో మంగళవారం ఆయన మాట్లాడారు. బలద వారం సంత నుంచి ప్రతీవారం బీహార్, హైదరాబాద్, కేరళతో పాటు పలు రాష్ట్రాల్లోని గోవధ శాలలకు లారీల మీద అక్రమంగా రవాణా జరుగుతోందన్నారు. అధికారులు స్పందించి పశువులు అక్రమ రవాణ అరికట్టాలని కోరారు.

విద్యార్థినికి అభినందనలు


మానసను అభినందిస్తున్న హెచ్‌ఎం కేశవరావు

హిరమండలం: ఏపీఆర్‌జేసీ పరీక్ష ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని జె.మానస 108వ ర్యాంకు సాధించింది. దీంతో ఆ పాఠశాల హెచ్‌ఎం టి.కేశవరావు బుధవారం అభినందించారు.

అయ్యప్పకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

సారవకోట: మండలంలోని కోదడ్డపనస గ్రామంలో వెలసిన స్వయంభూ అయ్యప్ప స్వామికి బుధవారం వైశాఖ మాసం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు చేపట్టారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అయ్యప్ప స్వామి భక్తులు వచ్చి దర్శించుకున్నారు.

వాణిజ్య పంటలపై ఆసక్తి


మిరియాపల్లిలో ఆశాజనకంగా నువ్వుల పంట సాగు

- పెరిగిన సాగు విస్తీర్ణం
- అనుకూలించిన వాతావరణం
- సాగునీటికి తప్పిన ఇబ్బందులు

ఎల్.ఎన్.పేట: తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు, లాభాలను తెచ్చిపెట్టే పంటల్లో వాణిజ్య పంటలు ప్రధానమైనవిగా చెప్పుకోవచ్చు. ఖరీఫ్ వరిసాగుతో పోల్చుకుంటే రైతులు ఎక్కువగా కష్టపడకుండా వాణిజ్య పంటలను పండించుకోవచ్చు. పాతపట్నం నియోజకవర్గంలోని మహేంద్రతనయ, వంశధార నదులు ఉన్నాయి. ఆయా నదీ తీరంతో పాటు వంశధార కుడి ప్రధాన కాలువ, సాగునీటి చెరువుల దిగువన ఉన్న రైతులు వాణిజ్య పంటలను ఎక్కువగా పండిస్తున్నారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో పంటలు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు.

నియోజకవర్గంలో సాగు విస్తీర్ణం

మండలం	సాగు విస్తీర్ణం ఎకరాల్లో
ఎల్.ఎన్.పేట	1,425
కొత్తూరు	2,160
మెళియాపుట్టి	1,650
పాతపట్నం	2,050
హిరమండలం	1,150

సాగుచేసే పంటలు

ఈ ఏడాది వాణిజ్య పంటల్లో ప్రధానంగా చెప్పుకునే నువ్వు, హైబ్రీడ్ పెసర, రాగులు, ఉలవ వంటి పంటలను ఎక్కువగా పండించారు. వీటితో పాటు పలు గ్రామాలకు చెందిన రైతులు వంగ, చిక్కుడు, బీర, బెండ వంటి కూరగాయల పంటలను పండిస్తున్నారు. ఎక్కువ విస్తీర్ణంలో నువ్వు, హైబ్రీడ్ పెసర సాగు జరుగుతోందని ఆయా గ్రామాలకు చెందిన రైతులు అంటున్నారు.

ప్రతీ ఏడాది సాగు



ప్రతీ ఏడాది వేసవిలో వాణిజ్య పంటలను పండిస్తాను. నువ్వు, హైబ్రీడ్ పెసరతో పాటు కూరగాయల్లో బెండ పండిస్తాను. ఈ ఏడాది కూడా సాగు చేస్తున్నాను. పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. ఈ ఏడాది వర్షాలు అడపాదడపా కురువడంతో సాగునీటికి ఇబ్బందులు లేవు. కొన్ని సందర్భాల్లో వ్యవసాయ బోర్లు నుంచి సాగునీరు అందిస్తాం. తక్కువ పెట్టుబడితో పంటలు పండించేందుకు వాణిజ్య పంటల సాగు బాగుంటుంది.

పల్లి అప్పలనాయుడు,
దబ్బపాడు, ఎల్.ఎన్.పేట

పోలీసు పికెట్ల పరిశీలన


పోలీసు పికెట్లు పరిశీలిస్తున్న డీఎస్పీ శృతి

ఆమదాలవలస: నియోజకవర్గంలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలీస్ పికెట్లను డీఎస్పీ వై.శృతి బుధవారం పరిశీలించారు. ఎన్నికల్లో శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా ఆమదాలవలస పోలీస్ సర్కిల్ పరిధిలో కుద్దిరాం, ఐజే నాయుడు కాలనీ, దన్నాన్నపేట గ్రామాల్లో ఏర్పాటు చేశారు. కుద్దిరాం, ఐజే నాయుడు కాలనీలో ఉన్న పోలీసు పికెట్లను డీఎస్పీ పరిశీలించి పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే గ్రామస్తులతో మాట్లాడుతూ ఎన్నికలు వస్తాయి, పోతాయని వాటి కోసం తగాదాలలో తలదూర్చి కేసులతో జీవితాలను నాశనం చేసుకోవద్దని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కె.వెంకటేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ విజేత టెక్కలి


విజేతగా నిలిచిన టెక్కలి జట్టు క్రీడాకారులు

సంతబొమ్మాళి: మండలంలోని ఉమ్మిలాడ గ్రామంలో జరిగిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంటు విజేతగా టెక్కలి జట్టు నిలిచింది. బుధవారం జరిగిన ఫైనల్‌లో సున్నాపల్లి, టెక్కలి జట్లు తలపడ్డాయి. మొదటి బ్యాటింగ్ చేసిన సున్నపల్లి జట్టు 78 పరుగులు చేయగా తరువాత బ్యాటింగ్‌కు దిగిన టెక్కలి జట్టు లక్ష్యాన్ని సాధించి విజేతగా నిలిచింది. విన్నర్‌గా నిలిచి టెక్కలిజట్టుకు రూ. 50 వేల నగదు, ట్రోఫీని నిర్వాహకులు అందజేశారు.

ప్రకృతి సాగు.. బహు బాగు


ఘన జీవామృతాన్ని తయారు చేస్తున్న మహిళలు

- ప్రకృతి సేద్యంపై పెరుగుతున్న ఆసక్తి
- తక్కువ పెట్టుబడితో అదనపు ఆదాయం
- ఆరోగ్యకర ఉత్పత్తులకు ప్రజల్లో ఆదరణ


ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిస్తున్న పంటలు


ద్రవ జీవామృతాన్ని తయారు చేస్తున్న రైతులు


కషాయాలను నిల్వ చేస్తున్న రైతులు

ఎచ్చెర్ల: మండలంలోని ప్రకృతి వ్యవసాయం జోరందుకుంది. ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను ప్రజలకు అందించడానికి, భూముల సారాన్ని పరిరక్షించడానికి ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోంది. దీంతో ప్రకృతి వ్యవసాయం సాగు విస్తీర్ణం గతేడాది కంటే 984 ఎకరాలు పెరిగింది. ప్రకృతి వ్యవసాయం సాగు వల్ల ఖర్చులు తగ్గడం, దిగుబడులు పెరగడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు.

పెరుగుతున్న సాగు విస్తీర్ణం

ప్రస్తుతం 22 గ్రామ పంచాయతీల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. గతేడాది 2,926 ఎకరాల్లో సాగు చేపట్టారు. ఈ ఏడాది 3,910 ఎకరాల్లో సాగుచేస్తున్నారు. ముస్ముందు ఈ విస్తీర్ణం ఇంకా పెరగనుంది. స్వయం సహాయక సంఘాల్లోని సభ్య రైతులతో పాటు ఇతర రైతులు కూడా ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించారు. మండలంలోని కేశవరావుపేట, ఫరీదుపేట, ఎస్ఎంపురం, ధర్మవరం, పొన్నాడ, తమ్మినాయుడుపేట, కొత్తపేట, కొంగరాం తదితర ప్రాంతాల్లో ఎక్కువగా సాగుచేస్తున్నారు. వీరంతా దాదాపు సన్న, చిన్నకారు రైతులే. ఆకు కూరలు, కూరగాయులు, బొప్పాయి, నిమ్మ, మామిడి, జీడిమామిడి, వరి తదితర పంటలను ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేస్తున్నారు.

సహజ ఎరువులు

పంటల సాగుకు ప్రకృతి సిద్ధంగా లభించే పదార్థాలు, ద్రవాలతో తయారుచేసిన ఎరువులు, క్రిమి సంహారక కషాయాలను వినియోగిస్తున్నారు. రసాయనిక ఎరువుల కంటే ఇవి తక్కువ ధరకు లభిస్తుండడంతో వీటిపై దృష్టి నిలిపారు. జీడిమామిడి పూతలపై పురుగుల నివారణకు, పూత నిలవడానికి మజ్జిగ, ఇంగువ, బెల్లం మిశ్రమ ద్రావణాన్ని, ఎరువుగా వాడటానికి ఆవుపేడ, బెల్లం, పప్పు దినుసుల పిండి, తగినంత గోమూత్రాన్ని కలిపి మిశ్రమంగా తయారుచేసిన ఉండలను పంటలకు ఎరువుగా వాడుతున్నారు. అలాగే వీటికి నీటిని కలిపి తయారుచేసిన ద్రవ జీవామృతాన్ని పంటలపై చీడ, పీడల నివారణకు, పంట బలంగా ఎదిగేందుకు వినియోగిస్తున్నారు. అగ్గితెగులు నివారణకు మారేడు కషాయం, వరిలో సుడిదోమ నివారణకు రేడియో మొక్కల ఆకులతో తయారుచేసిన కషాయం, వైరస్ నివారణకు పేడ కషాయం, పురుగుల నివారణకు నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అగ్నిఅస్త్రం వంటి కషాయాలను వినియోగిస్తూ పంటలను పండిస్తున్నారు. వీటిని కొందరు రైతులు స్వయంగా తయారు చేసుకుంటున్నారు. మరికొందరు ఆయా గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం వారు ఏర్పాటుచేసిన మినీ దుకాణాల ద్వారా కొనుగోలు చేసుకుని వ్యవసాయానికి వినియోగిస్తున్నారు.

భూములు సారవంతం



ప్రకృతి వ్యవసాయం వలన భూములు సారవంతమవుతున్నాయి. తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన ఆకు కూరలు సాగవుతున్నాయి. పట్టణం, దూర ప్రాంతాల నుంచి మా గ్రామాల మీదుగా వెళ్లేవారు ఇక్కడ వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుకు ఆసక్తి చూపుతన్నారు. దీంతో సాగుతో ఆశించిన రాబడి వస్తోంది.

– గొలివి రామకృష్ణ, గొలివివానిపేట

అంతరపంటతో అదనపు ఆదాయం



బొప్పాయి, ముల్లంగి పంటలను ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పెంచుతున్నాము. ఇవి ఏపుగా ఎదిగాయి. ఫలసాయానికి వచ్చేలోగా అదనపు ఆదాయం కోసం అంతర్ పంటలుగా కూరగాయులు, ఆకుకూరలు సాగు చేపట్టాం. ఇవికూడా ఏపుగా ఎదిగి విక్రయానికి సిద్ధమవుతున్నాయి.

– సూర అప్పన్న, రైతు, కేశవరావుపేట

పూర్తిస్థాయి ప్రకృతి వ్యవసాయానికి కృషి



మండలంలోని 22 పంచాయతీల్లో ప్రకృతి వ్యవసాయ సాగు చేస్తున్నారు. మిగిలిన వారు పాక్షికంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించి వ్యవసాయం చేస్తున్నారు. పూర్తిస్థాయిలో ప్రకృతి వ్యవసాయానికి కృషి చేస్తున్నాం. రైతుల్లో నమ్మకం పెరగటం వలన గతేడాది కంటే ఈసారి సాగు విస్తీర్ణం పెరిగింది.

– సీహెచ్ సూర్యనారాయణ, ఎస్‌డీపీ, ప్రకృతి వ్యవసాయం

మార్కెట్ విస్తరణతో రైతుల ఆసక్తి

మండలంలోని గ్రామాల్లో ప్రకృతి సిద్ధంగా పండిన పంటల గురించి తెలుసుకుని, ఇతర ప్రాంతాల ప్రజలు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ద్వారా ఉత్పత్తులను కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. దీంతో రైతులు తమ ఉత్పత్తులకు మార్కెట్ లభిస్తోందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరింత మంది ప్రకృతి వ్యవసాయానికి మొగ్గు చూపేలా వెలుగు, ప్రకృతి వ్యయసాయ విభాగం అధికారులు, సిబ్బంది గ్రామాల్లో అవగాహన ర్యాలీలు, సమావేశాలను నిర్వహించి సాగును ప్రోత్సహిస్తున్నారు. దీంతో మరింత మంది రైతులు ఆసక్తి చూపుతున్నారు.

తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శారద

ఆమదాలవలస రూరల్: గ్రామాల్లో తాగునీటి సమస్యలు పరిష్కరించడానికి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎంపీపీ తమ్మినేని శారద అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో తాగునీటి సమస్యల గురించి పలువురు సభ్యులు తెలియజేయడంతో, జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీటిని సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల కోడ్ వలన కొన్ని పనులకు అంతరాయం కలుగుతుందని, దీనిని అధిగమించేందుకు తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ప్రజలకు కనీస వసతుల కల్పనకు తగు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోందని పేర్కొన్నారు. ఎక్కడ సమస్యలు ఉన్నా వెంటనే పంచాయతీ కార్యాలయాలకు తెలియజేయాలని సూచించారు. వీధి దీపాల నిర్వహణ, పారిశుద్ధ్యం మెరుగుకు తగిన ప్రణాళికలతో ముందుకు వెళ్లాలన్నారు. సమావేశంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, ఎండీపీవో వాసుదేవరావు, మండల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

విద్యార్థుల ఎంపిక


వడగ హరిణి


పిన్నింటి సాహితీ


కోరుకొండ నీహంత్

పొందూరు: స్థానిక మానవస వేణి పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు జిల్లాలోని పలు రెసిడెన్సియల్ పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి ఎంపికయ్యారు. గత నెలలో జరిగిన రెసిడెన్షియల్ పాఠశాలల ప్రవేశ పరీక్షల ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. వీరిలో వడగ హరిణి, పిన్నింటి సాహితిలు వమ్మరవల్లి రెసిడెన్షియల్ పాఠశాలకు, కోరుకొండ నీహాంత్ ఎస్ఎంపురం రెసిడెన్సియల్ పాఠశాలకు ఎంపికయ్యారని పాఠశాల హెచ్‌ఎం ఎం.కిషోర్ తెలిపారు.

నవధాన్యాల సాగుపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అడిషనల్ డీపీఎం ధనుంజయ్

సారవకోట: మండలంలోని చీడిపూడి రైతు భరోసా కేంద్రంలో బుధవారం ప్రకృతి వ్యవసాయ అడిషనల్ డీపీఎం ధనుంజయ్ రైతులకు నవధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలకరి వర్షాలకు ముందుగా ఎకరాకు 12 కేజీల నవధాన్యాల విత్తనాలు చల్లుకోవాలని సూచించారు. అనంతరం 45 రోజుల తర్వాత దమ్ము పట్టి నీటిలో మురగనివ్వాలన్నారు. తద్వార నేల గుల్లబారుతుందని, నేల నీటి నిల్వ చేసుకునే సామర్థ్యం పెంచుకుంటుందని తెలియజేశారు. నేలలో ఉండే సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది పంట దిగుబడి పెరుగుతుందన్నారు. కనుక రైతులు నవధాన్యాల సాగుపై ఆసక్తి కనబర్చాలని సూచించారు. ఆయనతో పాటు ఎస్ఎఫ్ఏ బాబాజీ, మాస్టర్ ట్రైనీ టీవీ రమణ, యూనిట్ ఇన్‌చార్జి మోహన్, రమణమ్మ, రోహిణి, ప్రకాశ్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నంలో భారీవర్షం


వర్షం పడుతున్న దృశ్యం

పాతపట్నం: మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ, ఉక్కపోత ఉండడం, మధ్యాహ్నం వర్షం పడడంతో ప్రజలకు కొంత ఉపశమనం కలిగించింది. గత కొన్ని రోజులుగా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలకు తాజా వర్షంతో కొంత ఉపశమనం లభించింది. మూడు నెలలుగా మహేంద్రతనయ, చెరువుల్లో నీరులేకపోవడంతో పశువులకు, ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు. పాతపట్నంలో కుండపోత వర్షం కురియడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. కొరసవాడ, కాగువాడ, బురాగాం తదితర గ్రామాల్లో పంట పొలల్లోకి నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

'ఖరీఫ్ సీజన్‌పై దృష్టి సారించాలి'

ఎచ్చెర్ల క్యాంపస్: రానున్న ఖరీఫ్ సీజన్‌పై వ్యవసాయ శాఖ సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి సూచించారు. ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు శాఖలపై సమీక్షలు చేపట్టారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా సకాలంలో విత్తనాలు, ఎరువులు అందజేయాలని, శతశాతం ఈ క్రాపింగ్ చేయాలని సభ్యులు సూచించారు. జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా నిలిచిపోయిన పనులు పునరుద్ధరించాలని, ప్రతి ఇంటికీ కుళాయిలు ఏర్పాటు చేసి మంచినీరు అందేలా చర్యలు తీసుకోవాలని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఆరోగ్య సిబ్బంది మాట్లాడుతూ గ్రామాల్లో టీబీ వ్యాధిపై ప్రత్యేకంగా స్క్రీనింగ్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిరంతరం గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఉపాధి హామీ పథకం పనులు సక్రమంగా నిర్వహించాలని, వేసవి నేపథ్యంలో ఎండల రక్షణకు చర్యలు తీసుకోవాలని, గరిష్ట వేతనాలు లభించేలా చర్యలు తీసుకోవాలని సభ్యులు సూచించారు. పూర్తిస్థాయి పని దినాలు జాబ్ కార్డు ఉన్నవారికి కల్పించాలని చెప్పారు. పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణకు అధికారులు సహకరించాలని కోరారు. నారాయణపురం కుడికాలువ పూడికలు తీయాలని, ఖరీఫ్‌లో సాగునీరు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో రమాదేవి, పరిపాలన అధికారి పూజారి వెంకట సత్యరామ్మోహన్, సీనియర్ అసిస్టెంట్ కల్లూరి రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

కట్టె జనుము చేను దగ్ధం

సరుబుజ్జిలి: మండలంలోని పురుషోత్తపురం గ్రామానికి చెందిన రైతు కిల్లి లక్ష్మీగోవిందరావుకు చెందిన పొలంలో 5 ఎకరాలకు సంబంధించిన కట్టె జనుము చేనును గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం అర్ధరాత్రి దగ్ధం చేసినట్లు ఆయన తెలిపారు. ఎప్పటిలాగే బుధవారం పొలానికి వెళ్లి చూడగా చేను పూర్తిగా కాలిపోయిందని, చుట్టు పక్కల కూడా ఎటువంటి పంటలు లేకపోవడం వలన ఎవరో కావాలనే తమపై కక్షతో ఈ పని చేసినట్లు వాపోయారు.